(హనుమాయమ్మలు - వాళ్ళు మంచి రైటర్స్‌కారని వాళ్ళకు తెలీక లోకంలో మంచి రైటర్స్ లేరనీ, మంచి రైటింగ్స్ రావటంలేదనీ వారు కూడా మొసలి కన్నీరు విడుస్తున్నారు. అసలలా మంచి రైటింగ్స్ రాక పోవడానికి వారిలాటి వారే కారణమని వారికి చెప్పే నాథుడు లేడు. క్షమించాలి - నాథుల్ని వారు కేర్ చేయరు). రచయిత్రుల తెలుగు చూశాక వీరు సంఘంగా వేరే వుండటమే మంచిదనే అభిప్రాయాన్ని మావారు వ్యక్తం చేశారు. రచయిత్రులు రంగంలోకి దిగాక తెలుగుతనం ఎక్కువయిందని అన్న శ్రీ శ్రీగారు పై వాక్యవిన్యాసాలను చూస్తే ఏమంటారో... ఎవరేమన్నా ఆడా మగా, డోకొచ్చే తెలుగు కథల్లోనూ, నవలల్లోనూ వ్రాయకుందురుగాక!

# "మా తెలుగుతల్లికి మల్లెపూదండ"

మన ఆంధ్రలో పల్లెటూళ్ళు తెలిసో తెలియకో సానిదానిలా షోకు చేసుకున్న శాస్త్రుర్లుగారి కూతుర్లా వుంటాయి. బైదిబై అప్పలరాజు గారి ఇంగ్లీషు మనవడ్ని పాలేరెంకట సుబ్బడి కూతురి కొడుకు బఫూన్లా ఇమిటేట్ చేసినట్లు. మన బెజవాడను, కోకోనాడాను, రాజమండ్రిని, విశాఖపట్నాన్నీ, చుట్టు ప్రక్కల వుండే బదుద్ధాయి గ్రామాలు కామాల్తో సహా "వూ" చేసి "వూహ్వా" ఇమిటేట్ చేస్తూంటాయి. కావాలంటే గోహ్‌బ్యాక్ టు విలేజస్- పట్నం వేసే పోకిరీ వేషాలన్నీ వేయటానికి విలేజస్ ట్రయి చేస్తూ వుంటాయి.

మరైతే దేశానికి నగరం ప్రేయసైతే గ్రామంతల్లిట. ప్రేయసులు తల్లులవుతారు. కొండొకచో తల్లులూ ప్రేయసు లవగల్రు. వైస్‌వెర్సా.

కమింగ్ టు ది సబ్జెట్ - కంట్రీ లైఫ్‌మీద మోజు తగ్గి టౌన్ లైఫ్ మరియు సిటీ లైఫ్ మీద మోజు పెరగడంతో, జాయింట్లన్నీ ఫట్ ఫట్ మని (ఆంధ్ర తెలంగాణ తగూల్లాగ) ఏకీలు కాకీలు విడిపోయాయి.

పట్టణ నాగరికతొచ్చిపడి మన కంట్రీలైఫ్‌మీద, మన ఓల్డుకష్టమ్స్ అన్నిటిమీద మాంఛి దెబ్బ తీసింది. పిల్లి పాలకుండ తిరగదోసినట్లు మన ట్రెడిషనల్ వాల్యూలన్నీ తిరగబడి నేలపాలయాయి. ది ట్రబుల్ యీజ్ - (కొత్త కోక కొనుక్కోకుండా పాత కోక విప్పి పారేసినట్టు) కొత్తవి పుట్టుకు రాకుండానే పాతవి పనికిరాకుండా పోయాయి. దేర్‌ఫోర్ అనగా....

వెనకటి రోజుల్లో అంటే బీసీనాటి మాటకాదు నే చెప్పేది. నిన్న మొన్నటి వరకూ ఆస్తిపాస్తుల్లేని హేండ్ టు మవుత్ సంసారాల్లో ఎన్నెన్నో ఇంటిబ్బందులున్నప్పటికీ, వ్యక్తులమధ్య డబ్బుకంటె ఆపేక్షలూ అంతఃకరణలది పైచేయిగా వుండేది. ఆంధ్రావాడి సొమ్ము అరవవాడు తినలేదా - తిన్నాడ్డిన్నాడు. నిన్న మొన్నటిదాకా తెలంగాణవాడి సొమ్ము ఆంధ్రావాడ్డిన్నాడయ్యా,

తింటే తిన్నాడుకాని తిన్నది అరిగించుకోలేకపోయాడు. ఆ మాటలా వుణ్ణీండి. తెలుగువాడి సొమ్ము తెలుగువాడే తిన్నాడుకాని, మరో పంజాబీ, గుజరాతీ, సింధీ, యూపీవాడ్తిన లేదు కదా! తిన్నది కక్కిద్దాం – ఆ మాటొప్పుగుంటాన్నేను) తమ్ముడి పెళ్ళాన్ని చెరబట్టినందుకే గదా వాలిమీద సుగ్రీవుడు రాంబాణాన్ని ప్రయోగింపించిందీ– అదీ రైటే.... తమ్ముడి సొమ్ము తిన్డానికి అన్నగారికి హక్కుందయ్యా... అన్నగార్ని అల్లరిపెట్టడానికి, తిన్నది కక్కించెయ్యడానికీ తమ్ముడికీ హక్కుందయ్యా – అది రైటయితే యిది రైటున్నర. మరిప్పుడు వొరే తమ్ముడూ బుద్ధి గడ్డితిని రామప్పంతులు చేసిన పని చేశాను. ఈ యిల్లు నీదే – నువ్వే అంతా చక్కపెట్టు. నేనరుగుమీద కూర్చుని పెద్దరికమంతా నీ చేతుల్లో పెట్టి, నువ్వు పెట్టింది తిని తిట్టిందిపడి అహంకారం చంపుకుని బుద్ధిగా మసలుకుంటానొరే – యింటి పెండెకట్టు రెండుగా కోయించకు అని చెప్పడానికింత తాత్సారమేల – ఆంధ్రప్రదేశాన్ని పరిపాలించి అధికార చక్రాన్ని తిప్పడానికి సర్కారువాడెంత తగునో. రాయలసీమవాడెంత తగునో, తెలంగాణావాడూ అంతే తగును.

ఈ మాటెందుకొచ్చిందంటే – విడిపోయే రోజొస్తే అన్నదమ్ములైనా విడిపోతారు. విడిపోవలసిందే – (ఇందిరా గాంధీగారి తాతగారు లేచొచ్చినా, మరా విడిపోయిన జాయింట్లు అతుక్కోడం జరగదుకాక జరగదు) అని యీ మధ్య నెవరో అంటే గుండె గతుక్కుమంది. “మా తెలుగు తల్లికీ మల్లెపూదండ” అనే పాట గుర్తుకొచ్చింది. ఇప్పుడా దిక్కుమాలిన పాటెవరిక్కావాలి? ఎవరికీ అక్కర్లేదు. నా తెలంగాణ కోటిరత్నాలవీణ అన్నాడు దాశరథి. ఆ రత్నాలెక్కడున్నాయో తెమ్మంటున్నారిప్పుడు. కోటిరత్నాలని ఎందుకన్నావయ్యా బాబూ... (ఒకటో అరో తగ్గించి చెబితే సరిపోయేది కాదా) రత్నాలు పంచుకోడానికి గద్దెల మీద మారాజులు కత్తుల్ని దూస్తున్నారు.

ముఖ్యమంత్రి మీద పాపం గుట్టపెత్తు పడింది. తెలంగాణ గుఱ్ఱంపగలో చిక్కుకున్నాడు యిటూ అటూ కదల్టానికిలేకుండా ముఖ్యమంత్రి. గుఱ్ఱం ముందు మంత్రిని తినేస్తుందికదా! ఆ తర్వాత రాజు గుఱ్ఱాన్ని తింటాడు. తినడు అది వేరే సంగతి. చదరంగంలో జంతువుల నడకలు తెలుస్తాయి. రాజకీయాల్లో జంతువుల నడకలూ, ఎత్తులూ పోల్చుకోవడం కష్టమే! ఇద్దరు పోలీసులకి ఒక టోపీలాగ, ఒక జాతికి రెండు రాష్ట్రాలేమిటి? ఒకరు తగ్గాలి అంటే ఎవరూ? పెద్దవాడే తగ్గాలి. మన్నిచూసి ఇండియా అంతా నవ్వుతూంటే? “మా తెలుగు తల్లికీ మల్లెపూదండ” అని ఎలా పాడగలం?

కొంచెం ప్రేమ. కొంచెం ఆపేక్ష పిసరంత మంచితనం, కొద్దిగా క్షమ యిలాటి లక్షణాలేవీ మనలో లేవా? మనం మనుష్యులనూ కొయ్య బొమ్మలనూ – అప్పారావుగారు “మన వాళ్ళుట్టి వెధవాయలోయ్” అని ఏనాడో అన్నాడుగదా అని, మనం అస్తమానూ దాన్ని రుజూ చెయ్యడానికి సిద్ధమవుతూంటే సిగ్గుగా లేదూ?

రాజకీయాల్లోనూ ప్రణయ రాజకీయాల్లోనూ సిగ్గు పనికిరాదంటారు నిజమే. అది ప్రణయంలో మనోజ్ఞంగా వుంటుంది. ముద్దుగా వుంటుంది. ముచ్చటగా వుంటుంది. కాని ఇదో – ఈ సిగ్గులేనితనం డాంషేంగా వుంటుంది. మనుషులలోని మంచి అంతా ఇగిరిపోయి

ఎగిరిపోయాక మనం చచ్చేం బతికేం? అల్ల కాటిమీద కెక్కించిననాడు సర్వపావకుడైన అగ్నిహోత్రుడికి తెలంగాణవాడూ, ఆంధ్రావాడూ ఒకటే! ఖద్దరు జెండా మీదను కప్పుకుని గన్ కారేజిమీద స్మశానానికొచ్చినవాడూ, మునిసిపాలిటీ చెత్తబండీలో తీసికొచ్చిన లేదా తీసుకురాబడినవాడూ ఒక్కటే. వీడు బతికినంత కాలం ఎలా బతికేడు? ఏయే మంచి పనులు చేశాడు? ఎందరి కుపకారం చేశాడు? ఎవరెవరి కంటతడి తుడిచాడు? యిలా అనుకునేలా తనువు లాగించేయటం ముఖ్యంకాని ఎందరి కొంపలార్పాడు? ఎన్ని సంసారాల్లో చిచ్చు పెట్టాడు? ఎందరి ఉపకారులకి అపకారం చేశాడు? ఎందరు మానవతుల్ని అవమానించాడు? ఎన్ని అబద్ధాలాడాడు? యిదా ప్రయోజకత్వం?

ఇప్పుడు చెప్పండి – "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" అని పాడాలంటే ముక్కలు దిగకుండావున్నాయి. మనసులో లేంది పైకి పాడాలంటే కష్టం. పాట రాక గింజుకుంటూంటే మావారు "ముఖ్యమంత్రీ! ముఖ్యమంత్రీ!" అంటూ వచ్చారు. "నాకది కడు ఇన్సల్ట్‌కరంబగు పదమై దోచెఁదున్" అన్నాను. నేను రాజునైతే నువ్వు నాకు మంత్రివి – ముద్దొచ్చే మంత్రివి కనుక ముఖ్యమంత్రి అన్నాను తప్పా.

"అబ్బ, చివాట్లుతినే వుద్యోగం – నాకొద్దు బాబూ" అన్నాన్నేను. మీరు రాజైతే నేను రాణీ అవాలికాని మంత్రేవిటండీ మంత్రీ గింత్రీనూ అన్నాను కంగిస్తూ. నీది చివాట్లుతినే ఉద్యోగవేకదా మంత్రన్నాను నన్ను క్షమించాననవా హృదయదాసీ అన్నారు.

నన్నెప్పుడూ మంత్ర నకండి అది కడుం గడు ఇన్సల్టుకరంబైన పదంబై తోచె – ఏవిటి నీలో నీవేదో పాడుకుంటున్నావ్ – అన్నారు. మా తెలుగు తల్లికీ మల్లెపూదండ అన్నపాట జ్ఞాపకం చేసుకుంటున్నాను సార్ అన్నాను. జ్ఞాపకం చేసుకోకు అన్నారు గంభీరంగా మొహంపెట్టి.

ఇంట్లో చప్పుడయింది. పిల్లి పాలగిన్నెను తిరగదోసింది లేవ్వేం అన్నారు శ్రీవారు. లేవలేనన్నాను. మొండితనంకాదు. దేశంలోని ట్రాజిడీవలన కలిగిన ఒక ఫీలింగు. పిల్లి మూతి నాక్కుంటూ మా ముందునుంచే వెళ్తోంది. దాన్ని ఓటెయ్యండి రాయుచ్చుకుని అన్నాను. "మీదబడి పీకుతుందే" అన్నారు. నాకు నవ్వొచ్చింది, ఏడుపొచ్చింది, చిరాకొచ్చింది, కోపవొచ్చింది. 'గెటవుట్' అన్నాను. మావారు వెళ్ళిపోయారు. లోపలకెళ్ళి స్టాండపాంది బెంచి అన్నాను. మావారు బెంచీ మీదెక్కి నిల్చున్నారు. నేనూ వెళ్ళి వారి ప్రక్కన నిలబడ్డాను.

# సైంటిఫిక్ సంసారం

వెనక మా నాయనమ్మ పెద్దప్పగారి కూతురి మనవడు టి.పి.యం. రావు బెనారస్‌నించొచ్చాడు. అతనికి మా అమ్మమ్మ మూడో తమ్ముడి మనవరాల్నే యిస్త. అంతా బీరకాయపీచే.... దాన్ని "జాకీ" అని పిలుస్తాడు దాని మొగుడు ముద్దుగా. "న" సైలంటట.